

తెలంగాణ ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 260 గురువారం 22 అక్టోబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

గత ప్రభుత్వాలతో పోలిస్తే వేగంగా వీసాలను రద్దు చేస్తున్న ట్రంప్ సర్కార్

వీటిలో 4,000 వీసాలు బెర్త్ టూరిజంకు సంబంధించినవని వెల్లడి

నేర కార్యకలాపాలు, మోసాలే వీసాల రద్దుకు ప్రధాన కారణాలు

ప్రభుత్వ చర్యలపై మానవ హక్కుల సంఘాల ఆందోళన



2

అమెరికాతో చర్చలకు ఇరాన్ షరతులు..

ఒక్క గ్రాము యురేనియం ఇచ్చేది లేదంటూ స్పష్టీకరణ

తాము శుద్ధి చేసిన యురేనియంను విదేశాలకు పంపేది లేదన్న ఇరాన్

బెదిరింపుల నడుమ చర్చలు జరపలేమన్న ఇరాన్ అధ్యక్షుడు

అమెరికాతో చర్చలకు ముందు 7 షరతులు విధించిన ఇరాన్

2



సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లెలో దసరా సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయ స్వామి, కోట మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సంప్రదాయబద్ధంగా జమ్మి చెట్టుకు పూజలు చేసి, గ్రామస్తులతో గడిపిన సీఎం

పుట్టిన గడ్డపై పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్ట్

2



తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు



2

బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్

రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి



2

హైదరాబాద్‌లో మూడు చోట్ల పోలీసుల దాడులు

జీవకారుణ్యమే నిజమైన భక్తి అని ప్రజలకు పిలుపు

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి

ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్

న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారని ఆరోపణ

అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు సభలు, సమావేశాలు

రాహుల్ గాంధీ అధికార దాహంతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ



2

ఆందోళనల వేళ రాహుల్ విదేశాలకు వెళ్లారంటూ బీజేపీ తీవ్ర విమర్శలు



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఆసక్తికరంగా స్పందించారు. రాహుల్ పర్యటన గురించి మీడియా ప్రశ్నించగా, "నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు" అంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. బుధవారం తిరువనంతపురంలో శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ – మిగతా2లో

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థి ఖరారు

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని ఖరారు చేసింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను తమ అభ్యర్థిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ పేరు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. – మిగతా2లో

సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లెలో దసరా సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయదశమి పండుగను కుటుంబ సభ్యులు, ప్రజల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లోని తన నివాసంలో శాస్త్రోక్తంగా ఆయుధ పూజ నిర్వహించిన ఆయన, అనంతరం సొంత గ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లెలో జరిగిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో పండితులు వేదమంత్రాల మధ్య సంప్రదాయ బద్ధంగా ఆయుధ పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రతా సిబ్బందికి చెందిన ఆయుధాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీ గణేశ్, నవీన్ యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లెకు బయలుదేరి వెళ్లారు. అక్కడకు చేరుకున్న సీఎంకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు దప్పుల చప్పుళ్లు, భారీ గజమాలలు, పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో, కోట మైసమ్మ ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత, దసరా సంబరాల్లో భాగంగా సంప్రదాయబద్ధంగా 'జమ్మి చెట్టు'కు పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, తెలంగాణలో జమ్మి ఆకులను బంగారంలా భావించి, పెద్దలకు ఇచ్చి ఆశీస్సులు తీసుకోవడం ఒక గొప్ప సంప్రదాయమని అన్నారు. ఇది ప్రకృతిని గౌరవించడం, పెద్దల పట్ల గౌరవం చూపడాన్ని గుర్తుచేస్తుందని తెలిపారు. అనంతరం సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ, "సాధారణ వ్యక్తిగా ఉన్న నన్ను ముఖ్యమంత్రి స్థాయికి చేర్చడంలో కొండారెడ్డిపల్లె ఒక స్ఫూర్తి శిఖరం. పుట్టిన గడ్డపై కుటుంబ సభ్యులతో కలిసి దసరా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కొండారెడ్డిపల్లె ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి

దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు. "స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్

కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. నిరసనల ముసుగులో చట్టాలను ఉల్లంఘించడం, నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, అశాంతి సృష్టించేందుకు విదేశీ నిధులు కూడా వస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా లక్షలాది మంది ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, మేధావులు-విద్యావంతులతో చర్చాగోష్ఠులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మందితో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. దేశ భద్రత, అర్హులైన ఓటర్ల హక్కుల విషయంలో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, ప్రతిపక్షాల నిరసనల పై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, ఎన్నికల సమగ్రత గురించిన ఆందోళనలను తెలియజేయడానికే తమ చర్యలని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

ఆందోళనల వేళ రాహుల్ విదేశాలకు వెళ్లారంటూ బీజేపీ తీవ్ర విమర్శలు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై వస్తున్న వార్తల పై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఆసక్తికరంగా స్పందించారు. రాహుల్ పర్యటన గురించి మీడియా ప్రశ్నించగా, "నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు" అంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. బుధవారం తిరువనంతపురంలో శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ "నేను ట్రావెల్ ఏజెంట్‌ను కాదు. ఆ ప్రశ్న నన్ను అడగటంలో అర్థం లేదు. నేను ఢిల్లీ వదిలి ఇక్కడికి ఎందుకు వచ్చాను? ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయి. కాబట్టి, నేను ఆ విషయంపై వ్యాఖ్యానించలేను" అని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. రాహుల్ వియత్నాం వెళ్తున్న విమానంలో ఉన్నారంటూ ఒక వీడియోను బీజేపీ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. నిరసనలతో బాగా అలసిపోయినందువల్లే ఆయనకు విశ్రాంతి అవసరమైందని బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్ ఎద్దేవా చేశారు. అయితే, రాహుల్ గాంధీ పర్యటనను కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ సమర్థించారు. ప్రధాని సహా ఇతర నేతలు విదేశాలకు వెళ్లడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని నిలదీశారు. విదేశాల్లో రాహుల్ విద్యార్థులతో, మేధావులతో సమావేశమవుతారని, ఇంటర్వ్యూలు ఇస్తారని ఆయన గుర్తుచేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థి ఖరారు

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని ఖరారు చేసింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను తమ అభ్యర్థిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ పేరు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, ఈ ఎన్నికల దృష్ట్యా వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను లక్ష్యంగా చేసుకుని ఎన్నికల కార్యాచరణను కవిత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాల సమన్వయం కోసం సయ్యద్ ఇస్మాయిల్‌ను ఎన్నికల కోఆర్డినేటర్, అబ్జర్వర్‌గా నియమించారు కవిత. ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. దసరా సందర్భంగా అభ్యర్థి ప్రకటనతో పాటు ఎన్నికల బాధ్యతలనూ తెలంగాణ రక్షణ సేన ఖరారు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రానున్న రోజుల్లో పట్ట భద్రుల మద్దతు కూడగట్టేందుకు పార్టీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది, అభ్యర్థి ప్రచారాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారన్నది మరింత ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రక్షణ సేన నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పేరు ఖరారు కావడంతో వరంగల్-ఖమ్మం-నల్లగొండ రాజకీయాల్లో ఈ ప్రకటన చర్చనీయాంశంగా మారింది.

సీజేపీ నేతల పిటిషన్.. ఫ్రాన్స్ అల్లర్లను ప్రస్తావించిన ఢిల్లీ హైకోర్టు

జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై నేడు విచారణ సందర్భంగా న్యాయ స్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనకు పోలీసు అనుమతుల వెనకున్న ఉద్దేశం నిరసన కారులను అడ్డుకోవడం మాత్రమే కాదని జస్టిస్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. నిరసనల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదన్న లక్ష్యం కూడా ఉందని పేర్కొంది. అక్టోబర్ 13న జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా ప్రయత్నించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సందర్భం గా సోమవారం వరకూ తమకు విధించిన జ్యుడీషియల్ కస్టడీని బుధవారం వరకూ మళ్లీ పొడిగించడాన్ని దాస్, రాంకా కోర్టులో సవాలు చేశారు. పిటిషన్లపై విచారణ సమయంలో న్యాయ స్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. జంతర్‌మంతర్ నిరసనలకు వేదిక కాదని ప్రభుత్వం ప్రకటించాక అక్కడకు దాస్, రాంకా ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని కోర్టు ప్రశ్నించింది. 'బారికేడ్ల ఏర్పాటు వెనుక ఒక



లక్ష్యం ఉంది. మీరు వాటిని లెక్కచేయక ముందుకు వెళితే మిగతా వారూ అలాగే చేసే అవకాశం ఉంది. అలాంటి వారిని మీరు అదుపు చేయలేకపోవచ్చు' అని పేర్కొంది. 'ఇలాంటి పరిస్థితులను మనం విదేశాల్లో చూస్తున్నాము. మొదట విద్యార్థుల సారథ్యంలో మొదలైన నిరసనలు చివరకు తీవ్ర రూపం దాల్చాయి.

తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

గత ప్రభుత్వాలతో పోలిస్తే వేగంగా వీసాలను రద్దు చేస్తున్న ట్రంప్ సర్కార్

అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం వీసాల రద్దుపై కొరడా ఝుళిపిస్తోంది. 2025 జనవరిలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటివరకు 3 లక్షలకు పైగా వీసాలను రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించింది. నేర కార్యకలాపాలకు పాల్పడటం, ప్రజా భద్రతకు ముప్పు కలిగించడం, మోసపూరిత చర్యల ద్వారా ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రద్దు చేసిన వీసాలలో సుమారు 4,000 వీసాలు 'బెర్త్ టూరిజం'కు సంబంధించినవి కావడం గమనార్హం. కేవలం అమెరికాలో బిడ్డకు జన్మనిచ్చి, తద్వారా ఆ శిశువుకు పుట్టుకతోనే అమెరికా పౌరసత్వం సంపాదించే లక్ష్యంతో ప్రయాణించడాన్ని బెర్త్ టూరిజంగా పరిగణిస్తారు. ఇలాంటి కార్యకలాపాలను ప్రోత్సహించే లేదా పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై దృష్టి సారించేందుకు ప్రత్యేకంగా ఒక టాస్క్ ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగాట్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలతో పోలిస్తే ట్రంప్ పరిపాలనలో వీసాల రద్దు ప్రక్రియ చాలా వేగంగా జరుగుతోందని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే, మోసాలకు పాల్పడే, లేదా దేశ భద్రతకు భంగం కలిగించే వీసాదారుల పట్ల తమ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. వీసాల రద్దు సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2026 ఆగస్టు నాటికి 1,75,000 వీసాలు రద్దు కాగా, సెప్టెంబర్ చివరి నాటికి ఆ సంఖ్య 2,50,000కి చేరింది. అప్పటికి బెర్త్ టూరిజంతో సంబంధం ఉన్న కేసులు 2,300 ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 4,000 దాటింది. 2026లో ఈ రద్దు ప్రక్రియ మరింత వేగవంతమైంది. అయితే, వీసాలు రద్దయిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించలేదు. మరోవైపు ట్రంప్ ప్రభుత్వ కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాలపై, ముఖ్యంగా వీసాల రద్దు ప్రక్రియలో సరైన నిబంధనలు పాటించడం లేదని మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అమెరికాతో చర్చలకు ఇరాన్ షరతులు.. ఒక్క గ్రాము యురేనియం ఇచ్చేది లేదంటూ స్పష్టీకరణ

అమెరికాతో చర్చల విషయంలో ఇరాన్ తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. తమ దేశంలో శుద్ధి చేసిన యురేనియంను ఒక్క గ్రాము కూడా విదేశాలకు పంపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ఇది తమ జాతీయ సంపదని, దీనిపై దేశ ప్రజలకే సర్వహక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. అంతేకాకుండా, అమెరికాతో చర్చల పునరుద్ధరణకు పలు కీలక షరతులను ఇరాన్ తెరపైకి తెచ్చింది. మంగళవారం టెహ్రాన్‌లో పర్యటించిన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌తో భేటీ సందర్భంగా ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ వ్యాఖ్యలు చేశారు. శుద్ధి చేసిన అణు పదార్థాలను కేవలం స్వదేశీ అవసరాల కోసమే వినియోగిస్తామని, వాటిని దేశం దాటించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సైతం ఇదే రీతిలో స్పందించారు. బెదిరింపుల మధ్య చర్చలు సాధ్యం కావని ఆయన కుండబద్దలు కొట్టారు. చర్చలకు ఉపక్రమించే ముందే అమెరికా తమపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని, సైనికపరమైన బెదిరింపులకు స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ ఘలీబాఫ్ మాట్లాడుతూ.. చర్చలకు సంబంధించి అమెరికా తమ ఏడు షరతులను నెరవేర్చాలని స్పష్టం చేశారు. పశ్చిమాసియా వ్యాప్తంగా కాల్పుల విరమణ, విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల, చమురు రంగంపై ఆంక్షల తొలగింపు వంటివి ఈ షరతుల్లో ప్రధానమైనవని ఆయన వెల్లడించారు. మొత్తానికి అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షల విషయంలో అమెరికా ముందు స్పష్టమైన డిమాండ్లను ఉంచడం ద్వారా, చర్చల విషయంలో తన దృఢ నిశ్చయాన్ని ఇరాన్ చాటిచెప్పింది.

సంపాదకీయం

ఆనాటి ధన్‌ఖడ్ వెనుక అసలు కథ..



భారతదేశ పురోభివృద్ధిని అడ్డుకోవడంతోపాటు దేశంలో రాజకీయ నాయకత్వాన్ని బలహీనపరచడానికి విదేశీ శక్తులు... ముఖ్యంగా అమెరికాలోని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయా? ప్రముఖ న్యాయవాది, మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే కూడా తాజాగా ఇలాంటి ఆరోపణలే చేశారు. సాల్వే వంటి వారి వ్యాఖ్యలను, ఆరోపణలను తేలికగా తీసిపారేయకూడదు. మన దేశ అంతర్గత వ్యవహారాలలో విదేశీ శక్తుల జోక్యంపై ఆరోపణలు వినిపించడం కొత్త కాదు. దివంగత ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎలాంటి అలజడి ఏర్పడినా, వాటి వెనుక విదేశీ శక్తుల పాత్ర ఉందని ఆరోపించేవారు. భారతదేశం బలమైన శక్తిగా ఎదగడాన్ని అమెరికా వంటి దేశాలు సహజంగానే జీర్ణించుకోలేవు. తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ, తమ పెద్దన్న పాత్రను భారతదేశం అంగీకరించాలని అమెరికా కోరుకుంటుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలో హరీశ్ సాల్వే వంటి వారి ఆరోపణలను కొట్టిపారేయలేము. 'సర్'కు వ్యతిరేకంగా ఓట్ చోరీ పేరిట కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఇటువంటి ఆరోపణలకు ప్రాధాన్యం సంతరించుకుంటోంది. కొంతకాలం క్రితం శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో జెన్--జీ ఉద్యమాలు రావడం, ప్రభుత్వాలు పతనం కావడం తెలిసిందే. జనాభా పరంగా చైనాతో పోటీపడుతూ ఆర్థికంగా ఎదుగుతున్న భారతదేశం ఇప్పుడు అంతర్జాతీయ ఉత్పత్తులకు అతి పెద్ద మార్కెట్‌గా అవతరించింది. ఈ కారణంగా భారతదేశంలో తమకు అనుకూల ప్రభుత్వాలు ఉండాలని, ప్రభుత్వాల విధానాలు తమ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని విదేశీ శక్తులు కోరుకోవడం సహజం. హరీశ్ సాల్వే ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందో తెలియాలంటే ఒక ఏడాది వెనక్కు వెళ్లాలి. అప్పుడు భారత ఉప రాష్ట్రపతిగా ఉండిన జగదీప్ ధన్‌ఖడ్ ఉన్నపళంగా రాజీనామా ఎందుకు చేశారు? అందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? విదేశీ శక్తులతో ఆయన చేతులు కలిపారా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరచి ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసే ప్రయత్నాలు జరిగాయా? ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తే తెర వెనుక ఏం జరిగిందో తెలుస్తుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మను అభిశంసించే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో తలెత్తిన విభేదాల వల్ల జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేశారని అప్పట్లో అందరూ భావించారు. సదరు ప్రచారాన్ని మీడియా కూడా నమ్మింది. అయితే తెర వెనుక జరిగింది మరొకటి అని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీని బలహీనపరచడానికి అమెరికాలోని కొన్ని శక్తులు ప్రయత్నించాయి. తమ ప్రయత్నాలకు ఊతం ఇచ్చి ముందుకు తీసుకువెళ్లేది ఎవరా? అని ఆరా తీశారు. ఈ క్రమంలో అప్పటి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, అనిల్ అంబానీలను ఆ శక్తులు ఎంచుకున్నాయట! ఈ ఇరువురూ ప్రధాని మోదీని ఏం చేయగలరు? అన్న ప్రశ్న రావడం సహజం. 2024 సాధారణ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. దీంతో బిహార్‌లోని జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం పార్టీలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నరేంద్ర మోదీకి ఏర్పడింది. టీడీపీ, జేడీయూతోపాటు చిరాగ్ పాశ్వాన్, అరవింద్ కేజ్రీవాల్ వంటి వాళ్లు సహకరిస్తే ప్రధాని మోదీ ప్రభుత్వం పతనం అవుతుందని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయవచ్చునని ఆ శక్తులు అంచనాకు వచ్చాయి. పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు? అని ఆరా తీసిన సదరు శక్తులకు అప్పటి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కనిపించారట! రాజ్యసభ చైర్మన్‌గా ఉన్న ఆయన అయితే రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపడం సులువు అవుతుందన్న నిర్ణయానికి వచ్చిన విదేశీ శక్తులు ఆయనను సంప్రదించగా ఓకే చెప్పారట. ధన్‌ఖడ్‌ను కలిసే ముందు ఆయా రాజకీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపే బాధ్యతను అనిల్ అంబానీకి అప్పగించారట! అయితే, అనిల్ అంబానీ కొంత మేరకు మాత్రమే తన పాత్రను పోషించగలిగారు. వ్యాపార పరంగా దెబ్బతిన్న అనిల్ అంబానీని ప్రధాన రాజకీయ పార్టీలు సీరియస్‌గా తీసుకోలేదు. అనిల్ అంబానీ నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. జేడీయూ అధినేత నితీశ్‌కుమార్, ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను మాత్రమే అనిల్ అంబానీ కలుసుకోగలిగారని చెబుతున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న జేడీయూ నేత నితీశ్‌కుమార్ కూడా అనిల్ అంబానీ ప్రతిపాదనలను సీరియస్‌గా తీసుకోలేదు. ఇక కేజ్రీవాల్ వంటి వారు జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసినట్టు అప్పట్లోనే వార్తలొచ్చాయి. అమెరికాలోని శక్తులు మన దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోతున్నాయని ఉప్పందుకున్న కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలు మరింత సమాచార సేకరణలో పడ్డాయి. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఏదో జరగబోతోందని తెలుసుకున్న చంద్రబాబు, నితీశ్‌కుమార్, చిరాగ్ పాశ్వాన్ వంటివారు విషయాన్ని ప్రధాని మోదీని కలిసి వివరించినట్టు తెలిసింది. అప్పటికే నిఘా వర్గాల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించుకున్న ప్రధాని మోదీ ఈ అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎవరెవరు కలుసుకున్నారో ఆరా తీశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రి లోకేశ్‌ను కూడా ఆరా తీశారు. తాను అప్పుడే కాదు -- ఎప్పుడూ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలవలేదని ఆయన కేంద్ర పెద్దలకు స్పష్టం చేశారు.

కామారెడ్డిలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

-లేజర్ ప్రదర్శన, బాణసంచా వెలుగులు..

కనువిందు చేసిన రావణ దహనం

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 21 కామారెడ్డి ప్రతినిధి:

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరయ్యారు. లేజర్ ప్రదర్శన, బాణసంచా వెలుగులు, రావణ దహన కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. లేజర్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ దసరా వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన లేజర్ ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ఆకాశంలో రంగురంగుల వెలుగులు విరజిమ్మగా, బాణసంచా ప్రదర్శనతో స్టేడియం పరిసరాలు సందడిగా మారాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన ప్రజలు ఉత్సవాలను ఆస్వాదించారు. చెడుపై మంచి విజయానికి ప్రతీకగా రావణ దహనం



విజయదశమి వేడుకల్లో ప్రధాన ఘట్టమైన రావణ దహన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. స్టేడియం పరిసరాలు ప్రజల సందడితో పండుగ శోభను సంతరించుకున్నాయి. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు కామారెడ్డి పట్టణ



ప్రజల్లో దసరా పండుగ ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయానికి ఆధునిక ప్రదర్శనలను జోడించి నిర్వహించిన ఉత్సవాలు ప్రజలకు ప్రత్యేక అనుభూతిని అందించాయి. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్‌తో పాటు జిల్లా అధికారులు, ఇతర ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా వేడుకలు



తెహెల్కా న్యూస్ , అక్టోబర్ 21 మందమర్రి:

సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో దసరా ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి,సరోజా వివేక్,మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ఎన్. రాధాకృష్ణ,మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్.శ్రీవాణి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా వారు వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దుర్గామాత విగ్రహాన్ని పల్లకిలో వెంకటేశ్వర ఆలయం నుండి మైదానములోకి ఊరేగింపుగా మైదానంలోని సప్త వ్యసనాల విగ్రహం వద్ద పూజలు నిర్వహించి, మైదానంలో ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులు గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... దసరా పండుగ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు,అది చెడుపై మంచి సాధించిన విజయానికి,సమాజంలో ఐక్యతకు ప్రతీక. మానవాళిలో ఉన్న సప్త వ్యసనాలు అనే రాక్షస ప్రవృత్తులను అంతం చేసి,ధర్మాన్ని,సన్మార్గాన్ని అనుసరించాలనే గొప్ప సందేశాన్ని ఈ ఉత్సవాలు మనకు అందిస్తాయి. సింగరేణి యాజమాన్యం మందమర్రి ఏరియాలో ఈ పండుగను ఇంత గొప్పగా నిర్వహించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ,మందమర్రి



ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణని అభినందించారు. కంటికి ఇంపుగా నిలిచే రంగురంగుల బాణసంచా కాల్పులు,సప్త వ్యసనాల రాక్షస దహనం, ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ శోభను మరింత పెంచాయని కొనియాడారు.జిల్లా కలెక్టర్, ఏఐటియుసి అధ్యక్షులు సీతారామయ్య మాట్లాడుతూ.. వేలాదిగా తరలివచ్చిన సింగరేణి ఉద్యోగులు, అధికారులు,మందమర్రి ఏరియా ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.భేదాభిప్రాయాలు లేని ఐక్యత చిన్న, పెద్ద, హోదా అనే తారతమ్యాలు లేకుండా, చిన్నారులతో సహా కుటుంబ సమేతంగా ప్రజలందరూ కలిసికట్టుగా ఈ వేడుకల్లో పాలుపంచుకోవడం ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.?సంస్కృతి-సాంప్రదాయాల పరిరక్షణ సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా, కార్మికులు,స్థానిక ప్రజల సంక్షేమం, సంస్కృతి-సాంప్రదాయాల పరిరక్షణలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింప చేశాయి. రంగురంగుల కాంతులను విరజిమ్ముతు, నాగసర్పం, దుబ్బ రాకెట్లు,మల్లె సంజరి, సూర్య చక్రం, గజ స్థంభం, జువ్వలదడి,గన్ రాకెట్, ఆకాశ



దీపాలు,సప్త వ్యసనాల రాక్షసుని దాహనము ప్రజల్ని ఎంతగానో అలరించాయి,ప్రజల కేరింత మధ్యలో కార్యక్రమం ఘనంగా జరగడం ఎంతో వన్నెను తెచ్చిందని అన్నారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలను తిలకించడానికి సింగరేణి ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులు,ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వారి కుటుంబ సభ్యులు ఇన్ని వేల మంది రావడం ఎంతో సంతోషంగా ఉందని అందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సందర్భంలో అందరికీ ఒక విజ్ఞప్తి చేశారు. సంవత్సరం ప్రపంచంలో ఎల్ నినో పకృతి ప్రభావం వలన ఈ సంవత్సరం సరైన వర్షాలు లేక వచ్చే సంవత్సరం వరకు మంచినీటి కరువు ఉంటుంది అలాగే ఎండలు ఎక్కువగా ఉండటం వలన కరెంటు కష్టాలు కూడా మొదలవుతాయి కాబట్టి అందరూ కూడా నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని ఎల్ నినో ప్రభావం కు బాధ్యులు కాకుండా ఉండాలని సూచించారు.

బెల్లంపల్లిలో ఘనంగా దసరా వేడుకల సందర్భంగా రావణాసురవధ కార్యక్రమం





-బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

-ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ దంపతుల తోపాటు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్

తెహెల్కా న్యూస్అక్టోబర్ 21 బెల్లంపల్లి ప్రతినిధి:

బెల్లంపల్లి పట్టణంలో దసరాపండుగ సందర్భంగా తిలక్ స్టేడియం లో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రావణాసుర వధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ సరోజన దంపతులతో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, అమరాజుల శ్రీదేవి మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి రమేష్ బాబు వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, రాష్ట్ర టీపిసీసీ కన్వీనర్ స్వామి, పిసిసి మెంబర్ చిలుమల శంకర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ లు హాజరయ్యారు. దసరా వేడుకల సందర్భంగా హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణాసుర వద కార్యక్రమం తిలక్ స్టేడియంలో హిందూ ఉత్సవ కమిటీ నిర్వహించగా నియోజ కవర్గంలోని పలు మండలాలతో పాటు పట్టణంలోని ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ మాట్లాడుతూ చెడుపై మంచి కోసం చేసిన పోరాటంలో విజయం వరించిన సందర్భంగా విజయదశమిని పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, పలుపథకాలను ప్రవేశపెట్టి ప్రజల అభిమానం సంపాదించడం జరిగిందని పేర్కొన్నారు. విదేశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ విద్యను అభ్యసించిన వారికి ఉపాధి కల్పించే దిశగా జర్మన్ భాషను నేర్పించడం జరుగుతుందని మందమరి పట్టణంలో మొదటి బ్యాచ్ ఎంపిక జరిగి భాష పై పట్టు సాధించే క్రమంలో జర్మన్ భాష నిపుణులను ఏర్పాటు చేయడం జరిగిందని ,బెల్లం పల్లి నియోజకవర్గంలోనూ సంబంధిత కార్యక్రమాన్ని విస్తరిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణాసుర వాద కార్యక్రమం నిర్వ హించి పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజల ందరూ ఒకే చోటకు చేర్చిన కమిటీ సభ్యులను మన స్ఫూర్తిగా ఆయన అభినందించారు .బెల్లంపల్లి పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దుర్గాదేవి కరుణాకటాక్షాలు అందరికీ దక్కాలని ఆయన మనసారా ఆకాంక్షించారు. విజయానికి గుర్తుగా విజయదశమి వేడుకలు నిర్వహించుకోవడం శుభపరిణామం అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదలకు బడుగు బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వెల్లడించారు. అనంతరం రావణాసుర వధ కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక ఆధ్వర్యంలో నిర్వహించగా పెద్ద పెద్ద ఎత్తున బాణాసంచా టపాకాయలు పేల్చి కార్యక్రమం ముగింపు దశకు చేర్చారు. పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా రావణాసుర వధ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణ పోలీసులు బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు, సిఐ హనుక్ లు పటిష్ట బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు..

బౌద్ధ ధర్మంతోనే ప్రపంచ శాంతి

-అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 21

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవీయ విలువలు కలిగిన బౌద్ధ ధర్మం పాటించడం వల్లనే ప్రపంచ శాంతి నెలకొంటుందని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య అన్నారు. అశోక విజయ దశమి పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లోని బౌద్ధ ఆరామం వద్ద జరిగిన అశోక విజయ దశమి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అమితమైన కోరికల ద్వారా మనుషులకు దుఃఖం సంభవిస్తుందని దుఃఖ నివారణకు అమితమైన కోరికలు తగ్గించుకోవడంతో పాటు మానవీయ విలువలతో, కరుణతో సాటి మనుషులను సమానత్వంగా చూసిన నాడే మానవ సమాజం మనుగడ సాధిస్తుందని మూడు వేల ఏండ్ల క్రితమే గౌతమ బుద్ధుడు బోధించాడని, బౌద్ధ ధర్మాన్ని పాటిస్తున్న చాలా దేశాలు శాంతియుత జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. బౌద్ధం పుట్టిన భారత ఉపఖండంలో బౌద్ధ ధర్మాన్ని, వాస్తవాలను నాశనం చేసి మనుధర్మ పాలన కొనసాగుతుందని అందువల్లనే సకల అసమానతలతో, కులాల కుళ్లుతో, మత ఘర్షణ లతో భారత సమాజం నష్ట పోతుందని అన్నారు. మానవీయ విలువలకు ప్రతి రూపమైన బౌద్ధ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించి పాటించిన నాడు దేశంలో సమసమాజం ఏర్పడుతుందని ఆయన అన్నారు.



-సత్యాన్ని దాచి దసరా పండుగ

ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ కళింగ యుద్ధంలో విజయం సాధించిన అశోకుడు ఆ యుద్ధ సమయంలో పారిన నెత్తురు, తెగిన నరఖాంటాలను చూసి చలించి పోయి తీవ్ర ఆవేదనతో ఉన్న తనను తన సహచరి బౌద్ధ భిక్షువు వద్దకు తీసుకెళ్లిందని, ఆ బౌద్ధ భిక్షువు చేసిన బౌద్ధ ధర్మ బోధన, అహింస, కరుణ ద్వారానే శాంతిని నెలకొల్పవచ్చని, బౌద్ధ ధర్మాన్ని పాటించడం ద్వారానే స్వేచ్ఛ, సమానత్వం నెలకొంటుందని జ్ఞానోదయం చెందిన అశోకుడు దశమి నాడు తన ఆయుధాన్ని వదలి ఆరోజు నిజమైన విజయంగా ప్రకటించుకున్నాడని ఆనాటి నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో దశమి నాడు విజయ దశమి జరుపుకోవడం భారత ఉపఖండంలో కొనసాగుతుందని సాయిని నరేందర్ అన్నారు. విలువలకు, శాంతికి, కరుణకు ప్రతిరూపమైన విజయ దశమి పండుగను ప్రజల నుండి దూరం చేయడానికే భారత దేశానికి వలస వచ్చిన ఆర్య బాపండ్లు అదే దశమి రోజు దసరా పండుగను తీసుకొచ్చి ప్రజల చేత తప్పుడు పండుగను చేయిస్తున్నారని అన్నారు. యుద్ధం ద్వారా శాంతి రాదని, యుద్ధం ద్వారా విజయం సిద్ధించదని, శాంతి ద్వారా, ప్రేమ, ఆప్యాయతల ద్వారా, స్నేహం, సమానత్వం, సౌభ్రాతృత్వం ద్వారానే శాంతిని నెలకొల్పాగలగుతామని అశోకుడు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన రోజు నిజమైన విజయ దశమని, అదే దశమి రోజున అక్టోబర్ 14, 1956 నాడు నాగపూర్ లోని దీక్ష భూమిలో ఆరు లక్షల మందితో అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని అన్నారు. ఆ బౌద్ధ ధర్మంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతుత్వాన్ని మన రాజ్యాంగంలో కూడా పొందుపరచారని అన్నారు. కానీ గత 3 వేల ఏండ్ల క్రితం భారత దేశంలో చొరబడిన ఆర్య బాపండ్లు పుక్కిటి పురాణాలు, కట్టు కథల పండుగలను మన ముందుకు తెచ్చి మన పూర్వీకులను చంపిన రోజునే మన చేత పండుగలను చేపిస్తున్నారు. అసలైన చరిత్ర కనుమరుగు చేయడానికే ఇలాంటి పండుగలను మన ముందుకు తెచ్చారనే సత్యాన్ని మనం తెలుసుకోవాలనేదే నా భావనని అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిని చంపిన రోజు, రావణాసురుడిని వధించే రామాయణం, మహాభారతంలోని పాండవులు, జమ్మి చెట్టు, ఆయుధాలు ఇవన్నీ ఒక దానికి ఒకటి సంబంధం లేని వివిధ కాలాలకు చెందిన పుక్కిటి పురాణాలని అన్నారు. ఆయుధ పూజ చేసి ఆయుధంతో సాటి మనుషులను సంహరిద్దామా శాంతి పూజ చేసి మనుషులను ప్రేమిద్దామా ప్రజలే తేల్చుకోవాలని అన్నారు. అశోకుడిని, బౌద్ధ ధర్మాన్ని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లి సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జన్ను పద్మ, మాదిగ జాంబవ జాగృతి సంగం నాయకులు బొల్లె సాంబయ్య, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుట్ల రవీందర్, ఉపాధ్యక్షులు ఎర్ర శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, డి ఎస్ పి నాయకులు మేకల సుమన్, సురేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బూజు గుండ్ల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మంత్రి చాణిక్య, వివిధ సంఘాల నాయకులు బీరం రాము, దేవరాజుగట్టు శ్రీనివాస్, భరత్, మాయవతి, ప్రసాద్, ప్రకాష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

-అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ.

తెహెల్కా న్యూస్ భువనగిరి21-10-2026

సైదాపూర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంస్మ రణ పరేడ్‌ను ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి IAS, జిల్లా ఎస్పీఅక్షాన్ష్ యాదవ్ IPS ముఖ్య అతిథిగాహాజరయ్యారు. పోలీస్ మాన్యువల్ ప్రకారంజిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు స మర్పించి వీర పోలీస్‌అమరవీరు లకు ఘనంగా నివాళు లర్పించా రు.అనంతరం పరేడ్ కమాండర్ ఆర్ఐ శ్రీనివాస్ నాయుడు ఆధ్వ ర్యంలో సంస్మరణ పరేడ్ నిర్వ హించి,అమరవీరులకు శోక శస్త్రం సమర్పిం చారు. తదుపరి అధికారులు,పోలీస్ సిబ్బంది అందరూ అమరవీరుల త్యాగాల ను స్మరిస్తూ లాస్ట్ పోస్ట్‌కు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరు లైన పోలీస్ సిబ్బందికి ఘననివా ళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీ రుల కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి IAS, జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ IPS ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు.అమరవీరుల కుటుం బాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇ చ్చారు. విధి నిర్వహణలో ప్రాణా లను అర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాలను ఎప్పటికీ మ రువలేమని, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తా మని తెలిపారు. సంగి లక్ష్మీనారాయణ నల్గొండ,ఎం.డి. అష్జల్ షరీఫ్ నల్గొండ,ఎం.డి. అహ్మద్ మొయినుద్దీన్ నల్గొండ,వి. లింగయ్య రామన్నపే ట, శోభనా ద్రిపురం, సి.హెచ్. నాగ రాజు రసూల్‌గూడెం, కట్టంగూర్ లకు నివాళులర్పించారు.ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీ లు లక్ష్మీనారాయణ,వినోద్ కు మార్,డీఎస్పీలు శ్రీనివాస్ నా యుడు, రవీందర్, మధుసూధన్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,సురేష్,సీఐలు శంకర్, చంద్రబాబు,భాస్కర్, మధు సూదన్,ఆర్ఐలు శ్రీనివాస్ నాయుడు,లతీఫుద్దీన్,జిల్లాలో ని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ ఓలు,ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పూర్వం జరిపిన చోటే జమ్మి పూజ

నాగోల్,అక్టోబర్ 21,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

నాగోల్ గ్రామంలో విజయదశమి పర్వదిన వేడుకలు గ్రామస్తులంతా కలిసి మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కాగా ఈసారి పూర్వం 50 ఏళ్ల క్రితం జరిపిన చోటే జమ్మి పూజను నిర్వహించడం విశేషం. విజయదశమి సందర్భంగా పూర్వం నాగోల్ గ్రామంలోని బొడ్రాయి, మైసమ్మ ఆలయం వద్ద జమ్మి పూజ నిర్వహించేవారు. తదనంతరం నాగోల్ స్కూల్ అక్కడ నుంచి పోచమ్మ ఆలయం వద్ద జరుపగా అక్కడికి గ్రామస్తులు సరిగా రాకపోవడంతో గ్రామస్తులంతా ఒకే నిర్ణయంతో ఈసారి పూర్వం జరిపిన చోటైన బొడ్రాయి, మైసమ్మ ఆలయం వద్ద ఘనంగా జమ్మి చెట్టుకు పూజ నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు జమ్మి ఆకును ఇచ్చిపుచ్చుకొని ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో గౌడ సంఘం అధ్యక్షుడు ఇంద్రాల రమేష్ గౌడ్, పల్లె సీతారాములు, చెరుకు శివకుమార్ గౌడ్, చిత్తుల ప్రకాష్ గౌడ్, బద్దం గణేష్ గౌడ్, చెరుకు గణేష్ గౌడ్, బద్దం జగదీష్ ,బద్దం కుమార్ గౌడ్, చెరుకు ప్రశాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు చెరుకు చిరంజీవి గౌడ్, చెరుకు ప్రవీణ్ కుమార్ గౌడ్, పల్లె లక్ష్మీదాస్, కందికంటి ఎట్టేష్, రావుల రాజు గౌడ్, జ్ఞానేశ్వర్ చారి, కంది గంటి రవి గౌడ్, కంది గంటి రఘు గౌడ్, అనంతరం శివకుమార్ గౌడ్ పల్లె లక్ష్మీనారాయణ, పల్లె లక్ష్మీ నరసింహ కొత్త నవీన్ కుమార్, గౌడ్, శెట్టి పెళ్లి వెంకటేష్,శెట్టి పెళ్లి రాజు, చెరుకు శ్రీనివాస్, చెరుకు శ్రీధర్ గౌడ్ చిత్తుల మహేందర్ గౌడ్,అధిక సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు, యువత పాల్గొన్నారు.



చితారమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు గాంధీ శ్యామలాదేవి



కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 21

శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పి ఎ సి చైర్మన్ దసరా విజయదశమి శుభ సందర్భముగా ఎమ్మెల్యే దంపతులు ఎమ్మెల్యే గాంధీ శ్యామలాదేవి కూకట్పల్లి లో చితారమ్మ అమ్మవారిని ఈవో సమక్షంలో వేద పండితులు తో ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవాని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు అదేవిధంగా సుమిత్రానగర్ కనకదుర్గమ్మను ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అమ్మవారిని వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ దేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు శేర్లింగంపల్లి ప్రజలకు ఉండాలని అదేవిధంగా ఏలినో వర్షా బావ ప్రభావం దేశము రాష్ట్రము ఎలినో వర్ష బావ ప్రభావం ఏర్పడినది కావున రాష్ట్ర ప్రజలు శేరిలింగంపల్లి ప్రజలకు ఎమ్మెల్యే విజయదశమి సందర్భముగా రాష్ట్రంలో రాష్ట్ర ప్రజలు విద్యుత్తు ఆధా చేయండి మంచి నీరు ఆదా చేయండి దసరా విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్య సందేశంగా భావించగలరని ఎమ్మెల్యే గాంధీ పిఎసి చైర్మన్ మనసు పూర్తిగా తెలిపారు, ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్ గారు సీనియర్ నాయకులు నాయినేని చంద్రకాంతరావు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మల్లేష్ ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరారు.

ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి



తెహెల్కా న్యూస్ భువనగిరి21-10-2026

భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని సర్పంచ్ ఎడ్ల వెంకటరెడ్డి మర్యా దపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాం క్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఎన్ తిమ్మా పురం గ్రామస్తులు మోరా నర్సి రెడ్డి,ఎండి ఇలియాస్,కౌన్సిలర్ తహేర బబ్లు,ఖ మహేందర్,షఫీ గ్రామస్తులు తదితరులు పాల్గొ న్నారు.

పల్లె వాతావరణం ఉట్టిపడేలా దసరా ఉత్సవాలు

-నువ్వుల బండ గ్రామ గౌరవ అధ్యక్షుడు మరియు నాగోల్ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ రాగిరి చంద్రమోహన్ గౌడ్.



ఎల్బీనగర్, నాగోల్, అక్టోబర్ 21,తెహెల్కా న్యూస్ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

విజయానికి ప్రతీకగా,చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనంగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జన చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నువ్వుల బండ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో జరిగిన జమ్మి పూజ దసరా ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన నువ్వుల బండ గ్రామ గౌరవ అధ్యక్షుడు మరియు నాగోల్ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ రాగిరి చంద్రమోహన్ గౌడ్. నువ్వుల బండ గ్రామంలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం, దసరా పండుగలో ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన జమ్మి చెట్టుకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. విజయదశమి రోజున జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందించడం, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ వేడుకలు మరోసారి చాటి చెప్పాయి. పల్లె వాతావరణాన్ని తలపించేలా ఉండటంతో గ్రామస్తుల ఐక్యత ఈ వేడుకల ద్వారా మరోసారి ప్రతిబింబించాయి. గ్రామస్తులందరూ కలిసి భక్తి, ఆనందోత్సాహాల మధ్య దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో ఘనంగా రామ్‌లీలా వేడుకలు

- పన్నాల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో, సాయినాథ్ రెడ్డి సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహణ

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ

అక్టోబర్ 21



కేపీహెచ్‌బీ 3వ ఫేస్ లో గల రమ్య గ్రౌండ్స్‌లో దేవీ నవరాత్రుల సందర్భంగా పన్నాల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో, సాయినాథ్ రెడ్డి సమక్షంలో రామ్‌లీలా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వేలాది మంది ప్రజలు తరలి రావడంతో రమ్య గ్రౌండ్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకులు తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు. గోవిందు మాస్టర్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహించగా, మ్యాజిక్ షోతో పాటు మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం దసరా ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రావణ దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని తెలిపారు. జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ చేపట్టే కార్యాల్లో విజయం సాధించాలని, ఈ విజయదశమి ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు, విజయాలను నింపాలని కోరుతూ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెడును విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొంటూ, ఎస్ఐఆర్ (సార్) ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను పరిశీలించుకోవడంతో పాటు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దసరా ఉత్సవ కమిటీ సభ్యులను పన్నాల హరీష్ రెడ్డి శాలువాతో సత్కరించి మూమెంటో అందజేశారు. ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరగడానికి సహకరించిన పోలీసులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాకారులను సత్కరించారు. వేలాది మంది భక్తులు, ప్రజల సమక్షంలో రామ్‌లీలా వేడుకలు, రావణ దహనం కార్యక్రమం విజయవంతంగా ముగిశాయి. రామ్ లీలా కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, శేరి సతీష్ రెడ్డి, శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, జి ఎల్ ఎన్ రెడ్డి, తులసి రెడ్డి, కోటేశ్వరరావు, మోటిపల్లి భరత్, ఆదిరెడ్డి, తిరుపతి చారి, విలేకరులు సూర్య ఉదయం భాష, గ్రామ దండోరా నరసింహ, లక్ష్మణ్, క్రాంతికుమార్, సునీల్ కుమార్, బుజ్జి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బంగారం ధరలు


manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,47,160	10gms
22 kt	₹	1,34,900	10gms
SILVER	₹	2,14,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

దసరా సందర్భంగా కేటీఆర్ ను కలసి శు భాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్,అక్టోబర్ 21,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



దసరా పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.

శ్రీ సీతారామాంజనేయ స్వామి సహిత సంతోషిమాత దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



తెహెల్కా న్యూస్ భువనగిరి 21-10-2026

పట్టణంలోని శ్రీ సీతారామాంజ నేయ స్వామి సహిత సంతోషి మాత దేవాలయంలో దసరా మహోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దర్శించుకొని పూజలు నిర్వ హించారు.అనంతరం దసరా పండుగ సంద ర్భంగా ఏర్పాటుచేసిన రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి రవికుమార్ మున్సిపల్ వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల వెంకటేశం కౌన్సిల ర్లు పచ్చల జగన్మోహన్,తహేర బబ్లు,స్వర్ణలత దేవాలయ చైర్మ న్ చాగంటి సురేష్ ధర్మకర్తలు శంకర్,రామాంజనేయులు,వడి చర్ల మల్లేష్,గుర్రం ప్రమీల,భక్తులు, నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

వేం నరేందర్ రెడ్డి కి దసరా శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ సభ్యులు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ
అక్టోబర్ 21



సత్యం శ్రీరంగం.

రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. విజయ దశమి సందర్భంగా కుటుంబ సమేతంగా వెళ్ళి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దంప తులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి ఈ పవిత్ర సంద ర్భాన ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, ఐశ్వర్యం కలగాలని మరియు మరిన్ని విజయాలు సాధించాలని దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియ చేసిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.

రెండున్నరేళ్లలో శ్రీవారి ఆలయ నిర్మాణం పూర్తి

- పద్మనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో పనులు.
- నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్.

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 21 కరీంనగర్ ప్రతినిధి :

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఆలయ నిర్మాణ పనులను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నేడు పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఆలయ నిర్మాణం ఏ విధంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయి, తదుపరి చేపట్టనున్న పనులు ఏమిటనే అంశాలపై కాంట్రాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణం జరుగుతున్న తీరును నిశితంగా గమనించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై కాంట్రాక్టర్లతో చర్చించారు. పనుల పురోగతి, నిర్మాణానికి పట్టే సమయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను కాంట్రాక్టర్లు ఆయనకు వివరించారు.

- రెండున్నరేళ్లలో పూర్తి చేస్తాం.


పద్మనగర్‌లో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని మరో రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు గంగుల కమలాకర్‌కు వివరించారు. నిర్దేశిత గడువులోగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేలా పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్,



మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, బోనాల శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ ఒళ్లాల మల్లేశం, దుర్షెడ్ మాజీ ఉపసర్పంచ్ శుంకిశాల సంపత్‌రావు, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు నూతి చందు, నూతి వెంకటేష్, కర్రె అనిల్, మంద రాజమల్లు, ఆరె రవిగౌడ్, ఆకుల కిరణ్, శ్రావణ్, దుర్గం మురళి తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగ సందర్భంగా జెండా ఆవిష్కరించిన పోత్నక్ ప్రమోద్ కుమార్





తెహెల్కా న్యూస్ భువనగిరి21-10-2026

భువనగిరి పట్టణంలో 25 వార్డు లో విజయదశమి సందర్భంగా ప్రతి సంవత్సరం వస్తున్న ఆచా రం సాంప్రదాయం ప్రకారంగా జెండా ఆవిష్క రించిన పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యర్వర్ పోత్నక్ ప్రమోద్ కు మార్.ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్ 25 వార్డ్ కౌన్సిలర్ బెండ సరూప లాల్ రాజు, రఘుబాబు, నాకోటి రాము ఉపేందర్, సిద్ధార్థ, తదితరులు పాల్గొనడం జరిగింది.

కరీంనగర్‌లో ఘనంగా దసరా, రావణ దహనం, శమీపూజ వేడుకలు

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 21 కరీంనగర్ ప్రతినిధి :

కరీంనగర్ నగరపాలక సంస్థ లో విజయదశమి (దసరా) వేడుకలు మంగళవారం రోజు అత్యంత వైభవంగా జరిగాయి. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పలు డివిజన్లలో జరిగిన దసరా వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లతో కలిసి ప్రత్యేక శమి పూజలు చేసి రావణ దహనం చేశారు. పలువురుకి సాంప్రదాయ బద్దంగా జమ్మి ఆకులను (బంగారం) పంచి ఆలింగనం చేసుకుని విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పర్వదినం ప్రతి ఇంటా ఆనందాలను వెదజల్లిందని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఈ పండుగను జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్ట స్థానమున్న దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను గుర్తు చేస్తుందని తెలిపారు. దసరా పండగ ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి సంకేతమని తెలిపారు. దసరా వేడుకల్లో జమ్మిపూజ, రావణ దహనాలు ప్రత్యేకతను చేకూరుస్తాయని, జమ్మి ఆకులను (బంగారం) ఆత్మీయులకు అందించుకోవడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం మన సంస్కృతిలోని గొప్ప దనానికి ప్రతీకలని కొనియాడారు. ప్రకృతిని ప్రేమించడం, పెద్దలను గౌరవించడం, బంధాలను బలోపేతం చేసుకోవడం, పరస్పర ప్రేమాభి మానాలను పంచుకోవడం వంటి ఉన్నత విలువలను దసరా సంప్రదాయాలు చాటి చెబుతాయని తెలిపారు. ఈ విజయదశమి పర్వదినం నగర ప్రజలందరికీ



ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు, సకల విజయాలను చేకూర్చాలని మేయర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీపి గౌస్ ఆలం పలువురు కార్పొరేటర్లు, ప్రజా ప్రతి నిధులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెహెల్కా న్యూస్ భువనగిరి21-10-2026

భువనగిరి పట్టణంలో 25 వార్డు లో విజయదశమి సందర్భంగా ప్రతి సంవత్సరం వస్తున్న ఆచా రం సాంప్రదాయం ప్రకారంగా జెండా ఆవిష్క రించిన పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యర్వర్ పోత్నక్ ప్రమోద్ కు మార్.ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్ 25 వార్డ్ కౌన్సిలర్ బెండ సరూప లాల్ రాజు, రఘుబాబు, నాకోటి రాము ఉపేందర్, సిద్ధార్థ, తదితరులు పాల్గొనడం జరిగింది.

జనగామ లో పోలీస్ అమరవీరులకు ఘన నివాళి కొవ్వొత్తుల ర్యాలీ

-జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ ఐపీఎస్

(జనగామ అక్టోబర్ 21 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)



పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జనగాంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనగాం డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొని, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఐపీఎస్, సిఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గాదేవి శోభాయాత్రలో పాల్గొన్న పోచంపల్లి రాజేందర్ రెడ్డి




నాగోల్,అక్టోబర్ 21,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనకదుర్గాదేవి అమ్మవారి నిమజ్జనం ఊరేగింపు శోభయాత్రలో ముఖ్యఅతిథిగా నాగోల్ డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ యువ నాయకుడు పోచంపల్లి రాజేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమ్మవారి ఆశీస్సులు డివిజన్ల ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కారణం లేకుండా వ్యక్తి పైన దాడి

-ఖాళీ బీరు సీసాతో నరేష్ తల, ఛాతికి గాయాలు.

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 21,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



వాస్తవాలు ఏమనగా, తేదీ 21.10.2026న 01:30 గంటలకు, ఫిర్యాదుదారుడైన దుబ్బాక సిద్దు, తండ్రి కృష్ణ, వయస్సు 19 సంవత్సరాలు, కులం: మాదిగ, వృత్తి: డెలివరీ బాయ్, నివాసం: ఇంటి నం. 2-108,నెర్రపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా, ఫోన్ నం. 6300787172 నుండి ఫిర్యాదు స్వీకరించబడినది. ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, తేదీ 20.10.2026 న రాత్రి సుమారు 21:40 గంటలకు, ఫిర్యాదుదారుడు తన ఇంటి పక్కనే నివసించే స్నేహితుడైన పాచాల నరేష్, తండ్రి బిక్షపతి, వయస్సు 28 సంవత్సరాలు, కులం: ఎస్సీ (మాదిగ),వృత్తి: పెయింటర్, నివాసం: ఇంటి నం. 3-15, నెర్రపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా, తో కలిసి నరేష్‌కు చెందిన యాక్టివా స్కూటీపై భోజనం చేయడానికి నెర్రపల్లి గ్రామం నుండి అబ్దుల్లాపూర్‌మెట్‌కు బయలుదేరారు. అదే రోజు రాత్రి సుమారు 22:30 గంటలకు వారు అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలోని బ్రిలియంట్ కళాశాల సమీపంలో, జాతీయ రహదారి నం. 65 సర్వీస్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ వారు వాహనాన్ని ఆపారు. ఫిర్యాదుదారుడు మూత్ర విసర్జన కోసం పక్కకు వెళ్లగా, అతని స్నేహితుడు పాచాల నరేష్ యాక్టివా స్కూటీ వద్ద సర్వీస్ రోడ్డుపై నిలబడి ఉన్నాడు అదే సమయంలో, ఇనాంగూడ బ్రిడ్జి వైపు నుండి బ్రిలియంట్ కళాశాల వైపుకు సర్వీస్ రోడ్డుపై స్ప్లెండర్ మోటార్ సైకిల్‌పై వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు నరేష్ వద్దకు వచ్చి, ఎటువంటి కారణం లేకుండా అతనితో గొడవకు దిగారు. అనంతరం వారు ఖాళీ బీరు సీసాతో నరేష్ తలపై మరియు ఛాతిపై దాడి చేయగా, అతనికి రక్తస్రావ గాయాలయ్యాయి. అంతేకాకుండా, వారు యాక్టివా స్కూటీ తాళాలను కూడా తమ వెంట తీసుకెళ్లారు. వెంటనే ఫిర్యాదుదారుడు గాయపడిన తన స్నేహితుడు పాచాల నరేష్‌ను చికిత్స నిమిత్తం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని మనోగ్న ఆసుపత్రికి తరలించాడు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారు నిలిపిన యాక్టివా స్కూటీ అసలు సంఘటన జరిగిన ప్రదేశానికి కొంత దూరంలో ఉన్నట్లు ఫిర్యాదుదారుడు గమనించాడు. కావున, పై సంఘటనకు సంబంధించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరాడు.కేసు నమోదు చేసి జె.వెంకట్ రెడ్డి ఎస్సై దర్యాప్తు చేయనైనది.

మంత్రులు, ఎమ్మెల్యేల పేరుతో పీఏ ల హవా!

-పోలీస్ స్టేషన్లు,రెవెన్యూ ఆఫీసుల్లో!

-పీఏలుఅడినంతడబ్బులు ఇస్తే రాచమర్యాదలు

-కాంట్రాక్టర్లు,పైరవీకారులు వస్తే పండుగే!

-పీఏల అక్రమాలవిషయం బాసులకు తెలియదా?

-కొన్నిచోట్లగన్ మ్యాన్ లు? పీఏలు రేట్లు ఇలా ఫిక్స్?



తెహెల్కా న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ అక్టోబర్ 21:

కొందరు తెలంగాణ మంత్రు లు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో వ్యవహా రాలన్నీ వారి పీఏ ల కనుసన్నల్లోనే నడుస్తున్నాయని చర్చ జరుగుతున్నది. వారిని కాదని ఎవరూ ఒక అడుగు సైతం ముందుకు వేయలేరనే టాక్ నడుస్తున్నది. దీంతో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు సదరు పీఏలను ప్రసన్నం చేసుకోవాల్సి వస్తున్నది. లేకపోతే బాసులకు తమ గురి ంచి ఎక్కడ నెగెటివ్‌గా చెబుతారేమోననే భయంతో, అడిగిందల్లా సమ కూరుస్తున్నట్టు తెలుస్తున్నది. వివిధ పనుల కోసం ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులకు, ఇంటికి వచ్చే విజిటర్స్‌కు ఒక్కో పనికి ఒక్కో రేటును ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఇటీవల భద్రాచలం ఎమ్మె ల్యే వద్ద పని చేస్తున్న ఓ పీఏ ఉద్యోగాల పేరుతో రూ.కోట్ల సొమ్మును దోచుకున్న విషయం తెలిసిందే! ఇదే తరహాలో చాలా మంది పీఏలు తమ బాసులుగా ఉన్న ఎమ్మెల్యేలను అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

-పీఏల అక్రమాలవిషయం బాసులకు తెలియదా?

మంత్రులు, ఎమ్మెల్యేలను నేరుగా కలవడం కష్టం. ముందుగా వారి పీఏలను సంప్రదించాలి. వారికి అన్ని విషయాలు పూసగుచ్చినట్లుగా చెప్పాలి. వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరువాతే లోనికి వెళ్లేందుకు లైన్ క్లియర్ అవుతుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు వివిధ పనుల్లో బిజీగా ఉండ టంతో తమ అపాయింట్‌మెంట్‌ల బాధ్యతలను పీఏలకు అప్పగిసు ంటారు. ఇక్కడే పీఏలు తమ తెలివిని ప్రదర్శించి, పరిస్థితులను తమవై పునకు తిప్పుకుంటున్నారు. వివిధ పనుల కోసం వచ్చే విజిటర్స్ వద్ద నుంచి ఎంతో కొంత వసూలు చేసిన తరువాతే చాంబర్ లోనికి అనుమతి ఇస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం మంత్రులు,ఎమ్మెల్యేలకు తెలిసే జరు గుతుందా? లేకపోతే రహస్యంగా కొనసాగుతుందా? అనేది తెలియకు ండాపోతున్నది. కొన్ని సార్లు చూసీచూ డనట్లుగా వ్యవహరిస్తున్నా మరి కొన్ని సార్లు మాత్రం వారిని మందలించి వదిలేస్తున్నట్లు తెలిసింది. పీఏల ప్రవర్తన వల్ల స్థానిక నియోజకవర్గ ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. ఎమ్మెల్యేను, మంత్రులను కలిసేందుకు పీఏలు అడ్డుగా మారారని, అప్పుడు రా ఇప్పుడు రా అని వెనక్కి పంపుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

-పీఏలు అడినంతడబ్బులు ఇస్తే రాచ మర్యాదలు

పీఏలు అడినంత ఇచ్చే విజిటర్స్‌కు రాచమర్యాదలు దక్కుతుంటాయి. వెళ్లినవెంటనే నమస్కారాలు, ముందు మంచినీళ్లు, కాసేపు ఆగిన తరు వాత చాయి బిస్కెట్ అందుతాయి. లేటైతే లంచ్ కోసం కూడా ఏర్పాట్లు చేస్తుంటారు. మంత్రులు, ఎమ్మెల్యేల మూవ్‌మెంట్‌ను సైతం ఎప్పటి కప్పుడు చెప్తుంటారు. ఎప్పుడు సెక్రెటేరియట్‌కు వెళ్తారు? ఏ రోజు ఏ టూర్ ఉంది? ఏ టైమ్ కు ఏ విలేజీలో ఉంటారు? ఎప్పుడు ఫ్రీగా ఉంటారు? అనే విషయాలు మినిట్ టు మినిట్ వాట్సాప్‌లో మేసేజ్ చేస్తుంటారు. దీంతో వివిధ పనుల కోసం వచ్చే విజిటర్స్ పీఏలకు ప్రతిసారీ ఎంతో కొంత సమర్పించుకుంటారు. ఒకవేళ ఇవ్వకపోతే మాత్రం చుక్కలు చూపిస్తుంటారు. ఫోన్లు చేసినా, మెసేజ్ చేసినా స్పందన ఉండదు.

-పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ ఆఫీసుల్లో!

నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ ఆఫీసుల్లో పీఏల పెత్తనమే కొనసాగుతున్నదనే విమర్శలు ఉన్నాయి. స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేల తరుపున రెగ్యూలర్‌గా మాట్లాడు తుండటంతో వారి మధ్య మంచి స్నేహం ఏర్పడటం సహజం. పీఏలు చెప్పిన మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు పనులు చేసిపెట్టడం రొటీన్‌గా మారింది. కొన్ని సార్లు చెప్పిన పని పూర్తిచేయడంలో ఆలస్య మైతే మాత్రం "బాసు సీరియస్ గా ఉన్నడు. త్వరగా పనిచేయండి" అంటూ హెచ్చరిస్తుంటారు. దీంతో ఎందుకొచ్చిన తలనొప్పి అంటూ అధికారులు పనులను పూర్తి చేస్తుంటారు. ఇదే అదనుగా భావించిన పీఏలు తమ సొంత పనులనూ చేయించుకుంటున్నట్టు ప్రచారం ఉంది. తమకు ఉన్న పరిచయాల ద్వారా నియోజకవర్గంలో వైన్ షాపులు, బార్లు, రియల్ ఎస్టేట్‌లో వాటాదారులుగా ఉన్నట్టు టాక్.

-కాంట్రాక్టర్లు, పైరవీకారులు వస్తే పండుగే!

మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసేందుకు కాంట్రాక్టర్లు, పైరవీకారులు వస్తే పీఏలకు పండుగ వాతావరణం వస్తుందని టాక్ ఉంది. ముందుగా అపాయిం ట్‌మెంట్ ఇప్పించినందుకు కనిష్టంగా రూ.10 వేల వరకు వసూలు చేస్తుంటారని ప్రచారం. సిఫారసు లెటర్ ఇప్పిస్తే కనిష్టంగా రూ.20 వేలు, పని పూర్తయితే రూ.50 వేలకు పైగా వసూలు చేస్తుం టారని తెలుస్తున్నది. నియోజకవర్గంలోని కాంట్రాక్టు పనుల బిల్లులు చెల్లింపు విషయంలో ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యేల సిఫారసులకు ప్రయా రిటీ ఇస్తున్నది. దీంతో సిఫారసు లెటర్ల కోసం కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు వస్తుంటారు. కాంట్రాక్టర్ల టోకెన్లను సిఫారసు లెటర్‌లో చేర్చడం, వాటిని రెగ్యూలర్ గా ఫాలో అప్ చేసే బాధ్యతలను పీఏలు చూస్తుంటారు. దీంతో పీఏలకు అడిగినంత సొమ్మును కాంట్రాక్టర్లు ఇవ్వడం రొటీన్‌గా మారింది.

-కొన్ని చోట్ల గన్ మెన్లు?

కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద పీఏల కన్నా అక్కడ పనిచేసే పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వీఐపీ సెక్యూరిటీపై ఫోకస్ పెట్టాల్సిన స్టాఫ్ ఆ విషయాన్ని పక్కన పెట్టి, అక్కడికి వచ్చే విజిటర్స్ వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేల వెంటే ఉండే గన్‌మెన్లకు ఫోన్ చేసి వీఐపీ మూవ్‌మెంట్ తెలుసుకునేందుకు కాం ట్రాక్టర్లు, చిన్న లీడర్లు, పైరవీకారులు ప్రయత్ని స్తుంటారు. అందుకు వారికి అడపా దడపా డబ్బులు ఇవ్వడం రొటీన్‌గా మారిందనే టాక్ ఉంది. ఈ విషయాన్ని గ్రహించిన పైస్థాయి అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నా వారిలో మార్పు రావడం లేదనే చర్చ జరుగుతున్నది.

-పీఏలు రేట్లు ఇలా ఫిక్స్ చేశారనే ఆరోపణలు!

-మెజార్టీ మంది ఎమ్మెల్యేల పీఏలు టీటీడీ దర్శనాల కోసం ఇచ్చే సిఫారసు లెటర్ల కోసం రూ.5 వేలు వసూలు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

-సీఎంఆర్ఎఫ్ అప్లికేషన్ అప్‌లోడ్ చేసేందుకు రూ. 3 వేలు తప్పనిసరి. ఎక్కువ అమౌంట్ ఇప్పించేందుకు 10 శాతం డిమాండ్

-ఓవర్సీస్ స్కాలర్ షిప్ శాంక్షన్ కోసం రూ.లక్ష డిమాండ్!

-లిగురుకులాల సీటు కోసం రూ.పది వేలు వసూలు

-లిపబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిఫారసు లెటర్ కోసం కనిష్టంగా రూ. 2లక్షలు

-కాలేజీల్లో ఫీజుతగ్గించాలని ఇచ్చే సిఫారసు లెటర్ రూ. 5 వేలు

-సీఐ, తహసీల్దార్ పోస్టింగ్ సిఫారసు లెటరు కోసం పీఏకు రూ.లక్ష (ఎమ్మెల్యేలకు అదనం)

-ఎక్సయిజ్ సీఐ పోస్టింగ్ సిఫారసు లెటర్ కోసం 2.లక్షలు (ఎమ్మెల్యేలకు సపరేటు)

-సీఐకి ఫోన్ చేసి కేసు లేకుండా చెప్పేందుకు రూ.10 వేలు, డీఎస్పీ, ఎస్పీ అధికారులకు ఫోన్ చేసేందుకు మరింత ఎక్కువ వసూలు చేస్తున్నట్లు సమాచారం.

రాజంపేటలో ఘనంగా విజయదశమి జెండా పండుగ





-60 అడుగుల ఎత్తులో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 21 కామారెడ్డి ప్రతినిధి:

కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో విజయదశమి సందర్భంగా నిర్వహించిన జెండా పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి. గ్రామం లోని చావిడి వద్ద 60 అడుగుల ఎత్తులో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గ్రామస్థులు వేడుకలను ఉత్సా హంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజంపేటలో కొన్నేళ్లుగా ఆనవా యితీగా కొనసాగు తున్న ఈ జెండా పండుగకు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. త్రివర్ణ పతాకం రెపరెపలా డుతుండగా గ్రామంలో పండుగ వాతావరణం నెల కొంది. ప్రతి సంవత్సరం విజయ దశమి సందర్భంగా నిర్వహించే ఈ వేడుకలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తున్నాయి. ఈ వేడుకలకు కాసం రామ్ రెడ్డి, పటేల్ సాయిబాబా, గ్రామ సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్, పటేల్ శ్రీధర్‌తో పాటు గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని 16 సంఘాలకు చెందిన కుల పెద్దలు, ప్రతినిధులు కార్యక్రమంలో భాగస్వాములై వేడుకలను విజయ వంతం చేశారు. గ్రామస్థుల ఐక్యతకు, జాతీ య సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ జెండా పండు గను ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడంతో విజయ దశమి సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ముగి శాయి.

బిజినెస్

ఎస్బీఐలో డేటా కలకలం.. డార్క్ వెబ్‌లో వేలమంది కస్టమర్ల కీలక సమాచారం.. ఖాతాదారులకు హెచ్చరిక!



దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో భారీ సైబర్ భద్రతా వైఫల్యం చోటుచేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 3,900 మంది కస్టమర్లకు సంబంధించిన అత్యంత కీలకమైన వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లో ప్రత్యక్షమైనట్లు బ్యాంకు గుర్తించింది. ఈ మేరకు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఎస్బీఐ అధికారికంగా సమాచారం అందించింది. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించింది. లీకైన సమాచారంలో ఏముంది?ఈ నెల 16న తమకు థ్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, అలాగే ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ నుంచి హెచ్చరికలు అందినట్లు ఎస్బీఐ తెలిపింది. డార్క్ వెబ్‌లో లభ్యమైన సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా విశ్లేషించగా, వాటిలో 3,897 రికార్డులు తమ కస్టమర్లకు చెందినవిగా గుర్తించినట్లు పేర్కొంది. బహిర్గతమైన ఈ సమాచారంలో కస్టమర్ల పూర్తి పేర్లు, బ్యాంకులో రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీ, లింగం, ఈమెయిల్ ఐడీలు, నివాస చిరునామాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు బ్రాంచ్ వివరాలు, కస్టమర్ ఇన్ఫర్మేషన్ ఫైల్ (సీఐఎఫ్) ఐడెంటిఫైయర్లు, లోన్, లీడ్ రికార్డులకు సంబంధించిన మెటాడేటా వంటి అత్యంత సున్నితమైన వివరాలు కూడా ఉన్నట్లు బ్యాంకు తన ఫైలింగ్‌లో వివరించింది.

కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ వచ్చేసింది.. ధర రూ.1.59 లక్షలు, ఫీచర్లు అదుర్స్



బజాజ్ ఆటో భారత మార్కెట్లో కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ బైక్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధరను రూ.1,59,406గా నిర్ణయించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న పల్సర్ ఎన్250కి అప్‌డేటెడ్ వెర్షన్‌గా దీన్ని తీసుకొచ్చింది. ఇంజిన్, గేర్‌బాక్స్, డిస్‌ప్లే సహా పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా 6-స్పీడ్ గేర్‌బాక్స్, క్విక్‌షిఫ్టర్, 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్ వంటి ఫీచర్లు కొత్త బైక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.డిజైన్ పరంగా పల్సర్ కుటుంబానికి చెందిన స్పోర్టీ రూపాన్ని కొనసాగించింది. బాడీపై పదునైన గీతలు, కొత్త పెయింట్ ఆప్షన్లు, తాజా గ్రాఫిక్స్ అందించారు. హెడ్‌ల్యాంప్ డిజైన్ మాత్రం సాధారణ ఎన్250 మోడల్‌కు దగ్గరగా ఉంది.ఇంజిన్ విషయానికి వస్తే.. ఇందులో 249 సీసీ ఎయిర్-కూల్డ్, ఆయిల్-కూల్డ్ ఇంజిన్‌ను అప్‌డేట్ చేశారు. నాలుగు వాల్వ్‌లతో పనిచేసే ఈ ఇంజిన్ 25 హెచ్‌పీ పవర్, 22 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సాధారణ ఎన్250లో 24.5 హెచ్‌పీ పవర్, 21.5 ఎన్ఎం టార్క్ లభిస్తాయి. అంటే కొత్త మోడల్‌లో స్వల్పంగా పవర్, టార్క్ పెరిగాయి. పాత 5-స్పీడ్ గేర్‌బాక్స్ స్థానంలో 6-స్పీడ్ గేర్‌బాక్స్‌ను ఇచ్చారు. క్లచ్ ఉపయోగించకుండా గేర్లు పెంచేందుకు వీలుగా స్పోర్ట్స్ షిఫ్టర్ ఫీచర్‌ను కూడా స్టాండర్డ్‌గా అందించారు. ఫీచర్ల పరంగా కొత్త బైక్‌లో ఎలక్ట్రానిక్ థ్రాటిల్ బాడీని ప్రవేశపెట్టారు. ఇది ఏబీఎస్ మోడ్‌లతో కలిసి రైడింగ్ మోడ్‌లకు మద్దతు ఇస్తుంది. అయితే, ఆయా మోడ్‌ల పూర్తి వివరాలను కంపెనీ వెల్లడించలేదు. పాత ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్ సదుపాయం ఉన్న 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్‌ను ఇచ్చారు. ఇందులో ల్యాప్ టైమర్, వాహన పత్రాలను భద్రపరిచే సదుపాయం కూడా ఉంది. అడ్జస్టబుల్ లివర్లు, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, హజార్డ్ స్విచ్, అకస్మాత్తుగా బ్రేకులు వేసినప్పుడు హెచ్చరించే పానిక్ బ్రేక్ అలర్ట్ ఫీచర్లను జోడించారు. సాధారణ పల్సర్ ఎన్250తో పోలిస్తే ఈ కొత్త మోడల్ ధర రూ.14,000 ఎక్కువ.

మార్కెట్లోకి జియో ఐపీఓ.. ఇది ఒక కొత్త అధ్యాయం: ఆకాశ్ అంబానీ



భారత టెలికాం, డిజిటల్ రంగంలో సంచలనాలు సృష్టించిన జియో ప్లాట్‌ఫామ్స్, తన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)తో స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ బుధవారం (అక్టోబర్ 21) ప్రారంభమైంది. దీని ద్వారా సుమారు రూ. 30,213 కోట్లను సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఐపీఓ తమ కంపెనీ ప్రస్థానంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ అభివర్ణించారు. ఈ ఐపీఓలో భాగంగా కంపెనీ ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ప్రైస్ బ్యాండ్‌లో సుమారు 27 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ఐపీఓ ప్రారంభమైన తొలి గంటల్లోనే రిటైల్, సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి దీనికి మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ.. "కంపెనీ లిస్టింగ్ అవ్వడంతో వాటాదారులు, కస్టమర్లు, ఉద్యోగులు, ఇతర భాగస్వాములపై మాకు బాధ్యత మరింత పెరిగింది. పారదర్శకత, బలమైన పాలన, స్థిరమైన వృద్ధికి కట్టుబడి ఉంటాం. మా సాంకేతిక సామర్థ్యాలను మరింత పటిష్టం చేయడంపై దృష్టి సారిస్తాం" అని తెలిపారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను ప్రధానంగా తమ టెలికాం అనుబంధ సంస్థ రుణ భారాన్ని తగ్గించుకోవడానికి వినియోగించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. తద్వారా సంస్థను నికర రుణ రహిత స్థితికి తీసుకురావాలన్నది తమ ప్రణాళిక అని పేర్కొంది. భవిష్యత్తులో చేపట్టే పెట్టుబడులకు, నిర్వహణ ద్వారా వచ్చే నగదు ప్రవాహాలను ఉపయోగించుకుంటామని వివరించింది. భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామని, మొబైల్, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్, డిజిటల్ సేవలు తమ ఆదాయ వృద్ధికి కీలక చోదకాలుగా నిలుస్తాయని ఆకాశ్ అంబానీ విశ్వాసం వ్యక్తం చేశారు.

న్యూజిలాండ్‌లో భువీకి పండగే.. అర్ష్‌దీప్‌కు అలెన్ చిక్కడం ఖాయమంటున్న మాజీ కోచ్!



న్యూజిలాండ్ పిచ్‌లపై భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ చెలరేగే అవకాశం ఉందని ముంబయి ఇండియన్స్ మాజీ ఫీల్డింగ్ కోచ్ జేమ్స్ పామెంట్ అన్నాడు. అక్కడి పరిస్థితులు భువీ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటాయని చెప్పాడు. మరోవైపు అర్ష్‌దీప్ సింగ్ తన స్వింగ్‌తో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్‌ను ఇబ్బంది పెట్టగలడని అంచనా వేశాడు.ిభారత్, న్యూజిలాండ్ మధ్య గురువారం నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో భువనేశ్వర్ నాలుగేళ్ల తర్వాత టీ20 జట్టులోకి తిరిగొచ్చాడు. న్యూజిలాండ్‌లో బంతి సహజంగా స్వింగ్ అవుతుంది. ఈ పరిస్థితులు భువీకి బాగా కలిసొస్తాయని పామెంట్ పేర్కొన్నాడు. భారత పేసర్లు కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయాలని అతడు సూచించాడు. అవసరమైనప్పుడు షార్ట్ బాల్స్ వేయాలని చెప్పాడు. న్యూజిలాండ్ బ్యాటర్లు దూకుడుగా ఆడతారని, బౌలర్లు ఏమాత్రం తేలికగా బౌలింగ్ చేసినా భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. పచ్చిక మైదానాలపై బౌలింగ్ చేసేటప్పుడు బూట్లకు సరైన పట్టుదల ఉండేలా చూసుకోవాలని అన్నాడు. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరం కావడం ఇతర ఆటగాళ్లకు అవకాశమని పామెంట్ అభిప్రాయపడ్డాడు. మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్ తమ సత్తా నిరూపించుకోవచ్చన్నాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి కూడా ఇది కీలకమైన సిరీస్ అని చెప్పాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టుకు ఉపయోగపడాలని సూచించాడు.


వైభవ్ సూర్యవంశీకి నిరీక్షణ తప్పదు.. కారణం ఇదే: శ్రేయస్ అయ్యర్



టీమిండియా టీ20 జట్టులో సంచలన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కించుకోవడానికి మరికొంత కాలం వేచి చూడక తప్పదని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ నిలకడగా రాణిస్తున్నందున, ప్రస్తుతానికి జట్టు కూర్పును మార్చే ఉద్దేశం లేదని తెలిపాడు. న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు శ్రేయస్ ఈ వ్యాఖ్యలు చేశాడు.ఐపీఎల్, అండర్-19 క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ.. ఇప్పటికే 8 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అయితే, అవన్నీ విదేశీ గడ్డపైనే కావడం గమనార్హం. స్వదేశంలో అతనికి ఇంకా ఆడే అవకాశం లభించలేదు. దీనిపై శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "వైభవ్ లాంటి ప్రతిభావంతుడైన ఆటగాడు డ్రెస్సింగ్ రూమ్‌లో సంతోషంగా ఉండటం ముఖ్యం. అతను చాలా చిన్నవాడు, అవకాశాలు అందిపుచ్చుకోవడానికి అతనికి చాలా సమయం ఉంది. మా ఓపెనర్లు నిలకడగా పరుగులు సాధిస్తున్నారు. ప్రపంచకప్ గెలిచిన జట్టులో వారు భాగం. కాబట్టి, వైభవ్ ఇప్పుడే నేరుగా జట్టులోకి రాలేడు" అని వివరించాడు. "నీకు అవకాశం తప్పక వస్తుంది. నీ ప్రక్రియలో స్థిరంగా ఉండు, కొన్నిసార్లు వేచి ఉండాలి అని నేను వైభవ్‌కు చెబుతూ ఉంటాను," అని అయ్యర్ తెలిపాడు.మరోవైపు, దాదాపు నాలుగేళ్ల తర్వాత టీ20 జట్టులోకి తిరిగి వచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ రాకపై శ్రేయస్ అయ్యర్ హర్షం వ్యక్తం చేశాడు. భువీ రాకతో జట్టు బౌలింగ్ విభాగం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. "భువనేశ్వర్ తనతో పాటు అపారమైన అనుభవాన్ని జట్టులోకి తీసుకువస్తాడు. గత కొంత కాలంగా మా జట్టులో ఈ అనుభవమే లోపించింది. ముఖ్యంగా ఐపీఎల్ తర్వాత చాలా మంది కొత్త బౌలర్లు జట్టులోకి వచ్చారు. గత రెండేళ్లుగా భువీ కెరీర్ గ్రాఫ్ చూస్తే, అతను ఐపీఎల్ కూడా గెలిచాడు. ఈ ఫార్మాట్‌లో ఎలా ఆధిపత్యం చెలాయించాలో అతనికి బాగా తెలుసు" అని అయ్యర్ పేర్కొన్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లో న్యూజిలాండ్‌తో జరిగే తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది.

స్పోర్ట్స్

మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్



భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఎట్టకేలకు తనదైన శైలిలో ఫామ్‌లోకి వచ్చింది. సుదీర్ఘకాలంగా పరుగుల కోసం ఇబ్బంది పడుతున్న ఆమె, నిన్న జింబాబ్వేతో జరిగిన మూడో టీ20లో విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగింది. కేవలం 41 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో అజేయంగా 91 పరుగులు సాధించింది. అయితే, ఈ అద్భుత ఇన్నింగ్స్ అనంతరం ఆమె తన భావోద్వేగాలను అదుపు చేసుకోలేకపోయింది. మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. గత 10 అంతర్జాతీయ మ్యాచ్‌లుగా హర్మన్‌ప్రీత్ ఒక్క అర్ధశతకం కూడా నమోదు చేయలేకపోయింది. ఇటీవలే ముగిసిన ఆసియా కప్, ఆసియా క్రీడల్లో భారత జట్టు స్వర్ణాలు గెలిచినప్పటికీ, కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత ఆమె వ్యక్తిగత ప్రదర్శన నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో జింబాబ్వేపై ఆడిన ఈ ఇన్నింగ్స్ ఆమెకు ఎంతో ఉపశమనాన్నిచ్చింది. ఇన్నింగ్స్ విరామ సమయంలో బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన ఆమె.. "చాలా సంతోషంగా ఉంది. క్రీజులో సమయం గడపడాన్ని, నా బ్యాటింగ్‌ను ఆస్వాదించాలనుకున్నాను" అని తెలిపింది. అనంతరం భారత జట్టు మాజీ కోచ్ డబ్ల్యూవీ రామన్‌తో మాట్లాడుతూ హర్మన్‌ప్రీత్ ఒక్కసారిగా భావోద్వేగానికి గురైంది. కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. "ఈ ఘనతలో మీకు కూడా భాగం ఉంది. జట్టులోకి రాగానే, 'నీకు నచ్చినట్లు ఆడు' అని మీరు చెప్పారు. నేను అదే చేశాను. ఆ మాటలకు ధన్యవాదాలు" అంటూ రామన్ ప్రోత్సాహాన్ని గుర్తుచేసుకుంది.ఈ సందర్భంగా తన పునరాగమనం వెనుక ఉన్న శ్రమను కూడా ఆమె పంచుకుంది. "ఆసియా క్రీడల తర్వాత నెట్స్‌లో చాలా సమయం గడిపాను. నా బ్యాటింగ్‌పై ఎంతో శ్రమించిన నా కోచ్ హిమాన్షు భయ్యాకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పాలి. నేను ఆడిన ఆటంతా ఆయన చలవే" అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. మొత్తానికి ఈ ఇన్నింగ్స్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ తిరిగి ఫామ్‌లోకి రావడం భారత క్రికెట్ అభిమానులకు సంతోషాన్నిచ్చే విషయం.

‘రామాయణ’కు క్లీన్ ‘యూ’ సర్టిఫికెట్.. భారీ రన్‌టైమ్‌తో వస్తున్న చిత్రం!



దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ‘రామాయణ’. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఒక ముఖ్యమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషో ప్రకారం, ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ ‘యూ’ సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో ఎలాంటి వయోపరిమితి లేకుండా అందరూ ఈ చిత్రాన్ని థియేటర్లలో వీక్షించవచ్చు. బుక్‌మైషోలో పొందుపరిచిన వివరాల ప్రకారం.. ‘రామాయణ’ సినిమా నిడివి 3 గంటల 15 నిమిషాలుగా ఉంది. అయితే, ఈ సమాచారం ఇంకా ‘సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్’ (సీబీఎఫ్‌సీ) అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు కాలేదు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని, బుక్‌మైషోలో ఉన్న వివరాలే దాదాపుగా ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయని తెలుస్తోంది. ఇతిహాస గాథ అయిన రామాయణాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తున్నందున, ఇంత భారీ రన్‌టైమ్ అవసరమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

బిష్ణోయ్ కమ్యూనిటీకి సల్మాన్ ఖాన్ క్షమాపణ చెప్పాలి.. అదే ఏకైక మార్గం: అనూప్ జలోటా

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు, బిష్ణోయ్ కమ్యూనిటీకి మధ్య కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలకాలంటే సల్మాన్ క్షమాపణ చెప్పడమే ఏకైక మార్గమని ప్రముఖ గాయకుడు, నటుడు అనూప్ జలోటా అన్నారు. ఇటీవల నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే సల్మాన్ క్షమాపణ చెప్పాలని ఆయన సూచించారు. అక్టోబర్ 18న ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనపై అనూప్ జలోటా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. “ఈ సంఘటన నన్ను చాలా బాధించింది. వీటన్నింటికీ ముగింపు పలకాలంటే ఒకే ఒక్క మార్గం ఉంది. సల్మాన్ ఖాన్ బిష్ణోయ్ సమాజానికి క్షమాపణ చెప్పాలి” అని ఆయన అన్నారు. తాను ఈ విషయాన్ని గతంలో కూడా చెప్పానని గుర్తుచేశారు. సల్మాన్ కారణంగా బిష్ణోయ్ కమ్యూనిటీ మనోభావాలు దెబ్బతిన్నాయని, క్షమాపణ చెప్పకపోతే వారు తమ బాధను ఇలాగే వ్యక్తం చేస్తూనే ఉంటారని జలోటా అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే సల్మాన్‌తో కలిసి పనిచేసేవారు, వారి కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అందువల్ల, ఇప్పటికైనా సల్మాన్ ఖాన్ ఒక కఠిన నిర్ణయం తీసుకుని, ఈ వివాదానికి ముగింపు పలకాలని కోరారు. కాగా, టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.



రామాయణం ఈవెంట్‌లో సాయి పల్లవి- ఊదా రంగు చీరపైనే అందరి చూపు!





నటి సాయి పల్లవి తన సహజమైన అందం, నటనతో పాటు సంప్రదాయ వస్త్రధారణతోనూ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటారు. తాజాగా ఆమె మరోసారి తన చీరకట్టుతో అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో జరిగిన ‘రామాయణం’ తెలుగు ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ చిత్రంలో ఆమె సీత పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.ఈ వేడుకకు సాయి పల్లవి ఊదా-లావెండర్ కలయికలో ఉన్న అందమైన టిష్యూ సిల్క్ చీరలో హాజరయ్యారు. ఆ చీరకు బంగారు వర్ణంతో చేసిన భారీ అంచు, జరీ పనితనం ప్రత్యేక అందాన్ని తెచ్చిపెట్టాయి. టిష్యూ సిల్క్ ఫ్యాబ్రిక్ కావడంతో చీరలో ఓ ప్రత్యేకమైన మెరుపు కనిపించింది. దీనికి సరిగ్గా సరిపోయేలా అదే రంగు బ్లౌజ్‌ను ధరించారు. ఈ బ్లౌజ్‌కు ముందు, వెనుక, చేతులపై బంగారు రంగు ఎంబ్రాయిడరీ వర్క్ చేశారు. మోచేతుల వరకు ఉన్న చేతులు, మాండరిన్ కాలర్ డిజైన్ ఆమె లుక్‌ను మరింత హుందాగా మార్చాయి.ఎప్పటిలాగే తన లుక్‌ను సింపుల్‌గా, సంప్రదాయబద్ధంగా ఉంచుకున్నారు. చెవులకు డ్రాప్ ఇయర్ రింగ్స్, చేతులకు అందమైన కడియాలు (కాడలు), చేతిలో జపమాల పట్టుకుని కనిపించారు. తన సహజమైన రింగుల జుట్టును సాఫ్ట్‌గా స్టైల్ చేసుకుని, అతి తక్కువ మేకప్‌తో దర్శనమిచ్చారు. గులాబీ రంగు ఐషాడో, లేత రంగు లిప్‌స్టిక్, నుదుటిపై చిన్న ఎర్ర బొట్టుతో తన రూపాన్ని పూర్తిచేశారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ‘రామాయణం’లో రాముడిగా రణబీర్ కపూర్ నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్ల కోసం సాయి పల్లవి మొదటి నుంచి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చీరకట్టులోనే కనిపిస్తున్నారు. గతంలో బంగారు రంగు కంచిపట్టు, పీచ్-ఆరెంజ్ ఆర్గాన్జా సిల్క్ వంటి చీరలలో ఆమె కనిపించారు. ప్రస్తుతం ఆమె ధరించిన ఊదా-బంగారు వర్ణం చీర, రాబోయే దీపావళి పండుగకు సంప్రదాయ ఫ్యాషన్‌కు స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రం నవంబర్ 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com